


# తిరుగుబాటు

గుత్తుల భాస్కరరావు

మనిషి మెత్తనైతే మొత్తబుద్దేస్తుంది.

మురహరి మెత్తటివాడనడంలో ఏమీ సందేహంలేదు. పైగా సిగ్గరి. ఆడపిల్ల కనిపిస్తే–నిద్రగన్నేరాకులా ముడుచుకు పోతాడు. సిగ్గుపడి తప్పుకు తప్పుకు నడుస్తాడు. ఆడవాళ్ళు దార్లో తగిలితే వాళ్ళు దగ్గరయ్యేకొద్దీ ... పాతకాలపు పెళ్ళికూతుర్లా తలదించుకుని ఊపిరి బిగబట్టి వాళ్ళని ఎప్పుడు దాటుకుపోతానా, ఎప్పుడు గండం గడుస్తుందా అని ఉక్కిరిబిక్కిరవుతాడు. చాలామంది అమ్మాయిలకి మురహరి మొహంలో ఈ రసాయనిక మార్పుల్ని చూసి తరించడమంటే ఎంతో సరదా. అతను ఒంటరిగా కనిపిస్తే ఓ పట్టాన వదిలేవారుకారు. అల్లరిపెట్టి వినోదించేవారు. మురహరంటే కాలేజీ అమ్మాయికీ అలుసే. హైస్కూలు అమ్మాయిలకీ అలుసే — ఎలిమెంటరీ స్కూలువదలి అపుడే హైస్కూల్లో అడుగుపెట్టిన ఆరోక్లాసు పాపకీ అలుసే.

మురహరి ఒకనాటి సాయంత్రం—

షైర్లు షికార్లు ఆమడదూరం గాబట్టి–బుద్ధిగా డాబామీద చదువుకుంటున్నాడు. గణగణ చదివే అలవాటేమో–వాయింపు ధోరణిలో సాగిపోతున్నాడు. కాస్సేపటికి మరో గణగణధ్వని–ఆడధ్వని వినిపించి అదిరిపడ్డాడు. ఎంతసేపట్నుంచి తనని గమనిస్తుందో ఉష వాళ్ళ మేడమీద బాల్కనీలోనుంచి తనవంక చూస్తూ - రెండు అరచేతుల్ని ఉత్తుత్తి పుస్తకంలా చేసుకొని లొడలొడ చదువుతున్నట్టు నటిస్తూంది. 'అంటే తన చదువుని గేలి చేస్తుందన్నమాట' అన్నభావం రాగానే మురహరి ఉడికిపోయి తక్కున పుస్తకం మూసేసాడు. ఉష పెద్ద చప్పుడుతో ఉత్పత్తి పుస్తకమనే చేతుల్ని మూసి పారేసింది. ఛి ఛి. అని మూలుక్కున్నాడు. ఆమె అచ్చం అలాగే విసు



క్కుంది. అతను చేతుల్లో మొహం దాచుకొని కణతలు నొక్కుకున్నాడు. ఓరగా చూస్తే—ఆమెకూడా మొహం చేతుల్లో యిరికించి కణతలు నొక్కుకుంది. మరో సారి...మరోసారి అయితే తల దించుకొనేవాడేగానీ మురహరికి ఆమె అభినయం...ఆ రకం ఆటపట్టింపుచూసి తల దించబుద్ధి కాలేదు. తను ఏం దేస్తే ఆమె అది చేస్తుంది. వట్టి కవ్వింపు. ఆకతాయితనం. విసిగిఉన్నాడేమో 'ఎన్నాళ్లీ ఆడపోరు. చివరికి యింటిపక్క ఉషకి కూడా లోకువా నా బ్రతుకు' అని వాపోయాడు. అతనిలో తిరుగుబాటుతనం తలెత్తింది.

ఊపిరితిత్తులనిండా గాలి పీల్చుకొని రొమ్ము విరుచుకు చూశాడు...ఉషవంక. ఆమెకూడా అలాగే చేసింది. అతను ఠీవిగా నడుంమీద చేతులుంచాడు. ఆమె అతని చర్యలకి విస్తుపోతూ...అలాగే నడుంమీద చేతులుంచింది. 'తను ఏం చేస్తే అది చేస్తుందా?' అనుకొని ఒక్కసారి "హాయ్ ఉషా" అని గాలిలో ఒక ముద్దు విసిరాడు.

అవతలినుంచి— మరి జవాబు లేదు ...మనిషి జాడా లేదు.